
ఆంధ్రజ్యోతి
3 చిత్తూరు జిల్లా వార్తలు
సోమవారం 27 జనవరి 2025



పరిష్కార వారధిగా...



- రేపు చిత్తూరులో ఆంధ్రజ్యోతి కార్యక్రమం
- హాజరుకానున్న మేయర్ అముద, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మా అక్షరం మీ ఆయుధం నినాదంతో దశాబ్దాలుగా బాధితుల పక్షాన నిలుస్తున్న ఆంధ్రజ్యోతి ఇప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం దిశగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లను ఎప్పటికప్పుడు వార్తలుగా మలచి వెలుగులోకి తీసుకువస్తున్న ఆంధ్రజ్యోతి, మరొక అడుగు ముందుకు వేసి ఆచరణాత్మక కార్యక్రమం ప్రారంభిస్తోంది. 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పేరుతో ఆయా ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యల్ని అక్కడి ప్రజలు ప్రజాప్రతినిధులతోనూ,అధికారులతోనూ నివేదించుకునేందుకు ఒక వేదికగా మారుతోంది. నాయకులను, అధికారులను ప్రజల వద్దకే తీసుకువచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా కేంద్రంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం జరుగుతుంది. నగరంలోని సంతపేటలో పీఎన్‌సీ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగే సమావేశానికి చిత్తూరు మేయర్ అముద, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు హాజరవుతున్నారు. విజయలక్ష్మి కాలనీ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వీరి దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని సమస్యలను ఆంధ్రజ్యోతి ప్రతినిధులు గుర్తించారు. విజయలక్ష్మి కాలనీలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లేవని ప్రజలు చెబుతున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచనలతో వీటి పరిష్కారానికి ఉన్న అవకాశాలను అధికారులు ఈ సమావేశంలో పరిశీలించి ప్రజలకు వివరిస్తారు.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జడ్జి భీమారావు, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎస్పీ మణికంఠ

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు






కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల హస్తాలతో హ్యాపీ రిపబ్లిక్ డే ప్రదర్శన

ప్రగతి పరుగులు



- జూన్ నాటికి చిత్తూరు- తచ్చూరు హైవే పూర్తి
- 2026 మార్చి నాటికల్లా చెన్నై- బెంగళూరు హైవే
- రూ.110 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.50 కోట్లతో 2108 గోకులం షెడ్లు
- గణతంత్ర దిన వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్


కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ హైస్కూల్లో యాజమాన్య కమిటీ వైస్ చైర్‌పర్సన్ సంధ్యారాణి కాళీమాత వేషధారణ


స్వాతంత్ర్య సమరయోధుడు టీసీ రాజన్‌కు సత్కారం

చిత్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లా ప్రగతిపథంలో పరుగులు తీస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. చిత్తూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం 76వ గణతంత్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి గురించి మాట్లాడుతూ రూ.3,800 కోట్లతో జరుగుతున్న చిత్తూరు- తచ్చూరు హైవే ఈ ఏడాది జూన్ నుంచి అందుబాటులోకి రానుందని, రూ.5వేల కోట్లతో నిర్మాణంలో ఉన్న చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి కానుందని తెలిపారు. దీపం-2 పథకం కింద జిల్లాలో 3,17,158 కుటుంబాలు సబ్సిడీ రూపంలో రూ.25.58 కోట్ల లబ్ధి పొందాయన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో 1,609 సీసీ రోడ్లను రూ.110 కోట్లతో ప్రారంభించగా 1,150 పనులు పూర్తయ్యాయన్నారు. రూ.50 కోట్లతో 2,108 గోకులం షెడ్లు మంజూరవగా.. సగానికిపైగా నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందించిన 310మంది అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందించారు.స్వాతంత్ర్య సమరయోధుడు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే 105 సంవత్సరాల సీఆర్ రాజన్‌ను సన్మానించారు. ఇటీవల ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన బంగారుపాళ్యం మండలం ఎగువరాగిమానుపెంటకు చెందిన కార్తీక్ తల్లిదండ్రులను సన్మానించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వ్యవసాయ భూమిని ఇస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.3వ తరగతి విద్యార్థిని అమీనా గణతంత్ర దినోత్సవంపై రెండు నిమిషాలపాటు ఇంగ్లీష్‌లో చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. జిల్లా జడ్జి భీమారావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు,మేయర్ అముద,ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, ఏఎస్పీ రాజశేఖర రాజు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దివంగత జవాన్ కార్తీక్ తల్లిదండ్రులకు సన్మానం

ఢిల్లీ గణతంత్ర దినోత్సవాల్లో జిల్లావాసులు


రాష్ట్రపతి భవన్ ముందు కుటుంబ సభ్యులతో సల్మా

చిత్తూరు అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం జరిగిన 76వ గణతంత్ర దినోత్సవాల్లో జిల్లాకు చెందిన పలువురు మహిళలు హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి విందులో పాల్గొన్నారు. చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన సల్మా పీఎం అవాస్ యోజనలో ఇంటిని నిర్మించుకున్నందుకు రాష్ట్రపతి ఇచ్చిన విందుకు హాజరయ్యారు. చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల బీకాం తృతీయ సంవత్సర విద్యార్థిని పవిత్ర ఎన్‌సీసీ శిబిరంలో రైఫిల్ షూటింగ్, ట్రెక్కింగ్ తదితర అంశాల్లో ప్రతిభ చూపినందుకు ఢిల్లీలో జరిగిన పెరేడ్‌లో పాల్గొన్నారు. ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు పంచాయతీలో స్వచ్ఛ భారత్ విలేజ్ వాటర్, శానిటేషన్, ఈడబ్ల్యూఎస్, జల్‌జీవన్ మిషన్ తదితర కార్యక్రమాలను చక్కగా అమలు చేసినందుకు సర్పంచ్ భవ్యశ్రీకి ఆహ్వానం దక్కింది. వీరంతా వేడుకల్లో పాల్గొని రాష్ట్రపతి భవన్‌లో ఫోటోలు తీసుకున్నారు.



రాష్ట్రపతి చేతులమీదుగా సొన్నేగానిపల్లె సర్పంచ్‌కు అవార్డు

శాంతిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం సొన్నేగాని పల్లె పంచాయతీ సర్పంచ్ పుష్పావతి రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు స్వీకరించారు.మహిళా శిశుసంక్షేమ కార్యక్రమాలతో పాటు పీఎంఉజ్వల్ యోజన వంట గ్యాస్ పథకాన్ని లబ్ధిదారులకు అందించడంలో చొరవ చూపినందుకు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.


అవార్డుతో పుష్పావతి



సచివాలయాల్లో 680మంది ఉద్యోగుల మిగులు


- సిబ్బంది రేషనలైజేషన్‌పై ఉత్తర్వుల జారీ
- జనాభా ఆధారంగా ఉద్యోగుల కేటాయింపు

చిత్తూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్‌పై రాష్ట్రప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ విషయమై నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. గ్రామ, వార్డు సచివాలయాల్లో కొన్నిచోట్ల సిబ్బంది ఎక్కువగా, మరికొన్నిచోట్ల తక్కువగా ఉన్నారు. జిల్లాలో అవసరమైన ఉద్యాన అసిస్టెంట్ల కంటే వ్యవసాయ అసిస్టెంట్లు ఎక్కువగా ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి, ఈనెల 25వ తేదీన మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లాలో 680 మంది సచివాలయ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. మరింతగా కసరత్తు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. దీని ఆధారంగా మిగులు ఉద్యోగుల్ని ఇతర శాఖల్లో సర్దుబాటు చేసే అవకాశాలున్నాయి. వైసీపీ ప్రభుత్వం 2019 అక్టోబరు రెండో తేదీనుంచి సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది.పెద్దఎత్తున ఉద్యోగుల్ని, వలంటీర్లను నియమించింది. ప్రస్తుతం జిల్లాలో 3,800 మంది గ్రామ, 821మంది వార్డు సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ రెండింటిలో కలిపి సుమారు 680 మంది ఉద్యోగులు మిగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం జనాభా ఆధారంగా సచివాలయాలను, అందులో ఉద్యోగులను కేటాయించనుంది.

మూడు కేటగిరీలుగా..

ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించింది. 2,500 మంది వరకు జనాభా ఉన్న సచివాలయాలను 'ఏ' కేటగిరీ కింద చేర్చిన ప్రభుత్వం, ఈ సచివాలయాలకు ఆరుగురు ఉద్యోగులను కేటాయించనుంది. 2,500 నుంచి 3,500 మంది జనాభా ఉన్న సచివాలయాలకు 'బి' కేటగిరీ కిందకు చేర్చారు. ఇలాంటి సచివాలయాల్లో ఏడుగురు ఉద్యోగులు పనిచేస్తారు. 3,500 కంటే ఎక్కువ మంది జనాభా ఉన్న సచివాలయాలను 'సి' కేటగిరీ కిందకు చేర్చిన ప్రభుత్వం.. ఇలాంటి వాటికి ఎనిమిది మంది ఉద్యోగులను కేటాయించనుంది. మరోవైపు ఉద్యోగులను కూడా మల్టీపర్పస్ ఫంక్షనరీలు, టెక్నికల్, ఆస్పిరేషన్ ఫంక్షనరీలు అంటూ మూడు విభాగాలుగా విభజించింది. వీరిని జనాభా ఆధారంగా సచివాలయాలకు కేటాయించనున్నారు. గ్రామ సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శులు, వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరీలు బాధ్యులుగా ఉంటారని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.




టీటీడీ ఏడీ భవనం వద్ద వేడుకలకు హాజరయ్యే అతిథులకు గుర్రంపై నుంచి క్యాడెట్ల స్వాగతం.. తిరుపతి పోలీసు పరేడ్ మైదానంలో పోలీసు, ఏఆర్ దళాలు.. పోలీసు జాగిలం విన్యాసం.. షార్ (శ్రీహరికోట)లో సీఐఎస్ఎఫ్ బలగాల విన్యాసాలు - తిరుపతిలో మూకాభినయం ప్రదర్శన

టీటీడీ ఏడీ భవనం వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 36 మంది అధికారులు, 267 మంది ఉద్యోగులు, ఎస్వీబీసీలో ఏడుగురికి 5 గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రాలు అందజేశారు.



టీటీడీ ఈవో శ్యామలరావు నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ



చీఫ్ ఇంజనీరు సత్యనారాయణ | పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు రవి | రవాణా, ఐటీ జీఎం శేషారెడ్డి | తిరుపతి ఎస్ఈ మనోహరం | అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ | ఆర్-1 డిప్యూటీ ఈవో బి.భాస్కర్ | బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ఎ.ప్రశాంతి



దాససాహిత్య ప్రాజెక్టు.. ఆనందతీర్థ చార్యులు | తిరుపతి ఈఈ నరసింహమూర్తి | తిరుమల ఈఈ వేణుగోపాల్ | తిరుపతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జయరాం నాయక్ | డివిజనల్ ఇంజనీరు చంద్రశేఖర్ | అకౌంట్స్ చెకింగ్ స్క్వాడ్ ఆఫీసరు శ్రీలక్ష్మీదేవి | తిరుపతి ఏవీఎస్వో కళావతి | అమ్మవారి ఆలయ ఏవీఎస్వో సతీష్ | తిరుమల ఈఈ రామకోటేశ్వర రావు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగరాజు | ఈఈ నీరజ



సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎస్ఎం వేణుగోపాల్ | శ్రీనివాసమంగాపురం ఆలయ ఏఈవో గోపినాథ్ | తిరుపతి ఏఈవో రవి | శ్రీవారి ఆలయ ఏఈవో దొరస్వామి | ఆయుర్వేదిక్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుశీల | అసిస్టెంట్ ప్రొఫెసర్ భాస్కరరావు | ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కృష్ణ | ఎస్వీబీసీ సీనియర్ మేనేజర్ బ్రాడ్ కాస్టింగ్ కళాధర్ | సీనియర్ ఏవీ రిపోర్టరు టి.పురుషోత్తంనాయుడు | ప్రొడక్షన్ మేనేజర్ ఎం.ఉమాసంజయ్ | ఎస్వీబీసీ సోషల్ మీడియా మేనేజరు రామలక్ష్మి



తిరుపతి జేఈవో ఆఫీస్ సూపరింటెండెంట్ తారకరామ్ | నటరాజ | సీవీఎస్వో ఆఫీస్ సూపరింటెండెంట్ పద్మావతి రామమూర్తి | వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ కవిత | అన్నదానం క్యాంటీన్ సూపర్‌వైజర్ హేమభూషణం | దోనార్ సెల్ జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ రెడ్డి | ఒంటిమిట్ట అర్చకుడు రాఘవాచార్యులు | తిరుచానూరు అర్చకుడు శ్రీనివాసాచార్యులు | తిరుచానూరు సీనియర్ పోటు కార్మికుడు శ్రీనివాసన్ | శ్రీవారి ఆలయ అర్చకుడు గోవిందాచార్యులు | సివిల్ అసిస్టెంట్ సర్జన్, డాక్టర్ భరత్



తిరుపతి పరేడ్ మైదానంలో..



ట్రాన్స్‌పోర్టు డీఐ జానకిరామరెడ్డి | కల్యాణకట్ట డిప్యూటీ ఈవో వెంకటయ్య | సీపీఆర్వో ఆఫీస్, ఇంద్రజ | డాక్టర్ రవిశంకర్‌కుమార్ | అమ్మవారి ఆలయ వాహన ఇన్‌స్పెక్టర్ సుభాష్‌నాయుడు



కలెక్టర్‌కు పోలీసు జాగిలం సెల్యూట్



వేడుకలను తిలకిస్తున్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



జాతీయ పతాకానికి కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధుల సెల్యూట్

'కసిరెడ్డి'కి నేతల నివాళి



తిరుపతి, జనవరి26(ఆంధ్రజ్యోతి): ఇండో-పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి కసిరెడ్డి బలరామ్ రెడ్డి విగ్రహానికి ఆదివారం పలువురు నివాళులర్పించారు. 'కసిరెడ్డి ఖలేజా' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో విద్యార్థులు విగ్రహం చూసేందుకు ఆసక్తి చూపించారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, పత్తిపాటి వివేక్,టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆర్కే నాయుడు, తోట వాసు, రంజిత్, చిన్న, గంగాధర్ తదితర విద్యార్థి సంఘ నాయకులు పూలమాల వేసి కసిరెడ్డి సేవలను కొనియాడారు.

రూఫ్‌టాప్ సోలార్‌కు ప్రాధాన్యం

● గణతంత్ర దిన వేడుకల్లో సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 26 : సదరన్ డిస్కం పరిధిలోని 8 జిల్లాల్లో రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తగిన ప్రాధాన్యం ఇస్తామని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే డిస్కం పరిధిలో 2,049 సర్వీసులకు సంబంధించి పనులు పూర్తయ్యాయని, తద్వారా 7,454 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతోందని అన్నారు. తిరుపతి సర్కిల్ పరిధిలోని నారావారిపల్లెలో ప్రయోగాత్మకంగా 25 మంది వినియోగదారులకు సోలార్ సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. తిరుపతి సర్కిల్‌లో విద్యుత్ చౌర్యం నియంత్రించే డీపీఈ విభాగం ఉద్యోగులకు ప్రత్యేక ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు రమణాదేవి, వరకుమార్, ధర్మజ్ఞాని, జానకీరామ్, కె.ఆదిశేషయ్య, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్‌నాయుడు, సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, సంస్థ జాయింట్ సెక్రటరీ గోపాలకృష్ణ, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, పి.మురళి, మురళీకుమార్, ఈఈలు, డీఈఈలు, ఏఈలు, ఏఏవోలు, పాల్గొన్నారు.



జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న సీఎండీ సంతోషరావు



తిరుమల విజన్ అమలుకు చర్యలు

●గణతంత్ర వేడుకలో టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జనవరి26(ఆంధ్రజ్యోతి): తిరుమల విజన్-2047 రూపకల్పనకు సీఎం చంద్రబాబు నాయుడు టీటీడీ అధికారులకు పలు సూచనలు చేశారని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సీఎం సూచనల మేరకు అలిపిరిలో బేస్ క్యాంప్, బహుళస్థాయి పార్కింగ్, స్మార్ట్ పార్కింగ్, లింక్‌రోడ్డుల నిర్మాణం, సబ్‌వేలతోపాటు రామ్‌భగీచా, బాలాజీ బస్టాండ్, పాత సత్రాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. రథసప్తమిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాకుంభమేళాలో నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేసి శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. అత్యాధునిక యంత్రాలతో అన్నప్రసాదాలు తయారు చేసేందుకు టీవీఎస్ మోటార్ సంస్థతో ఎంఓయూ చేసుకున్నట్టు చెప్పారు. లడ్డూ, అన్నప్రసాదాల తయారీకి వినియోగించే నాణ్యమైన ముడిసరుకుల ఎంపికలో సూచనలు చేసేందుకు రిలయన్స్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తొలుత పెరేడ్ మైదానంలో టీటీడీ ఈవో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. భద్రతా సిబ్బంది కవాతు ఆకట్టుకుంది. వివిధ విభాగాలకు చెందిన 36 మంది అధికారులు, 267 మంది ఉద్యోగులు, ఎస్వీబీసీలో ఏడుగురికి 5 గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రాలను అందజేశారు. డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, డీఎల్వో వరప్రసాదరావు, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీపీఆర్వో రవి, అదనపు సీవీఎస్వో శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ



కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు



ఏఎస్పీ (శాంతిభద్రతలు) రవిమనోహరాచారి | ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసులు | డీఎస్పీ శ్రీలత | నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు | సైబర్ సెల్ సీఐ వినోద్‌కుమార్ | శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ గోపి | వాకాడు సీఐ హుస్సేన్ బాషా | భాకరాపేట సీఐ ఇమ్రాన్ | పుత్తూరు సీఐ కె.సురేంద్ర | సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ



తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ | గంజాయి టాస్క్‌ఫోర్సు సీఐ సుబ్బరాయుడు | వెల్ఫేర్ ఆర్ఐ రమణారెడ్డి | మహిళా స్టేషన్ ఎస్ఐ గిరిజ | ట్రాఫిక్ ఎస్ఐ విజయలక్ష్మి | స్పెషల్ బ్రాంచి హెచ్‌సీ తమిళ ఎనియాన్ | ఎస్పీ గన్‌మ్యాన్ మస్తాన్ | ఎస్పీ సీసీ లక్ష్మీనారాయణ | ఏఎస్పీ సీసీ రాజేష్ | తిరుపతి ఈస్ట్ కానిస్టేబుల్ పురుషోత్తం నాయుడు | అలిపిరి కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం

● ప్రతిభకు పురస్కారాలు



కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న జేసీ శుభం బన్సల్



డీఆర్వో నరసింహులు | తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ | శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేందర్‌రెడ్డి | జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు | ఏపీఐసీసీ జోనల్ మేనేజరు చంద్రశేఖర్



ఏపీఎంఐసీ పీడీ సతీష్ | సూళ్ళూరుపేట ఆర్డీవో కిరణ్మయి | జిల్లా సహకార అధికారి లక్ష్మి



డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ | జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి | జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు విశ్వనాథరెడ్డి



జిల్లా మైన్స్ అధికారి బాలాజీనాయక్ | జిల్లా రిజిస్టర్ శ్రీరామ్‌కుమార్ | జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం



జిల్లా టూరిజం అధికారి జనార్దన్‌రెడ్డి | సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య | ఏపీటీడీసీ ఆర్ఎం రమణ ప్రసాద్



సమాచారశాఖ జిల్లా అధికారి బాలకొండయ్య | తుడా ఈఈ రవీంద్ర | డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు



సదరన్ డిస్కం తిరుపతి ఎస్ఈ సురేంద్రనాయుడు | సర్వే ల్యాండ్స్‌రికార్డ్సు ఏడీ అరుణ్‌కుమార్ | కలెక్టరేట్ ఏవో భారతి



ప్రొటోకాల్ తహసీల్దారు కుప్పయ్య | జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ | పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్



జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు | జీఎస్ఎస్, టీజీపీ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి | తిరుపతి కమిషనర్ మౌర్య

ఉత్తమ సేవలకు ప్రశంసలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవాల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. జిల్లాలోని 40 శాఖల్లో 310 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రశంసాపత్రాలను అందుకున్నారు.జిల్లా జడ్జి ఇ. భీమారావు, జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస రావు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, జేసీ విద్యాధరి, డీఎఫ్‌వో భరణి, మేయర్ అముద, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.

రూ.15.78 కోట్ల చెక్కుల పంపిణీ

డీఆర్డీఏ ద్వారా బ్యాంకు లింకేజి కింద 9897 స్వయం సహాయక సంఘాలకు రూ.9.21 కోట్లు, శ్రీనిధి కింద 27,298 సభ్యులకు రూ.1.79 కోట్ల నమూనా చెక్కులను కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. మెప్మా సంస్థ ద్వారా బ్యాంకు లింకేజ్ కింద 17,610 మంది లబ్ధిదారులకు రూ.2.53 కోట్ల నమూనా చెక్‌ను,ఉద్యానశాఖ కింద మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ కింద యంత్ర పరికరాలకు గాను 1,652 మంది లబ్ధిదారులకు రూ.2.24 కోట్ల చెక్‌ను కూడా పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 15ప్రభుత్వ శాఖలు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను స్వీకరిస్తున్న జిల్లా స్టాటిస్టిక్స్ అధికారి బి.సాంబశివారెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి డి.మధుసూదనరెడ్డి, కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కుప్పం డీఈఈ టి.గురవారెడ్డి, చిత్తూరు డీఎల్డీవో జి.రవికుమార్, కలెక్టరేట్ ఏవో బి.కులశేఖర్, నింద్ర తహసీల్దార్ శేషగిరి రావు, గుడిపాల తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి, కుప్పం తహసీల్దార్ చిట్టిబాబు, ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్, పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎం.చంద్రశేఖర రెడ్డి



చిత్తూరు వన్‌టౌన్ సీఐ జయరామయ్య, చిత్తూరు టూ టౌన్ సీఐ నెట్టి కంఠయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ భాస్కర్, కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, గంగవరం సీఐ ప్రసాద్, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, సీసీఎస్ సీఐ ఉమామహేశ్వర రావు, చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఏఆర్ సీఐ భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లికార్జున, బిరాల ఎస్ఐ నరసింహులు, కాణిపాకం ఎస్ఐ ధరణీధర, సదుం ఎస్ఐ షేక్షావలి, రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్



డీసీఆర్బీ ఎస్ఐ ఉమామహేశ్వర రెడ్డి, చిత్తూరు ఎస్ఐ కరీమున్నీసా, ఏఆర్ ఎస్ఐ నటరాజ్, పలమనేరు అగ్రికల్చర్ ఏడీ గీతా కుమారి, పశుసంవర్ధక శాఖ ఏడీ షేక్ ఆసిఫ్, విద్యుత్ శాఖ ఈఈ మునిచంద్ర, సదుం డీఈఈ నరేంద్ర, ఆర్టీసీ చిత్తూరు వన్ డిపో మేనేజర్ కృష్ణమూర్తి, టూ డిపో మేనేజర్ రూపశ్రీ, డీఈవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ దీపిక, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కోటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎస్ఎస్ డిప్యూటీ ఈఈ మధుసూదన బాబు



జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా జడ్జి భీమారావు

సమరయోధుల త్యాగాలు మరువలేనివి

జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు లీగల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు మరువలేనివని జిల్లా జడ్జి భీమారావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కోర్టు ఆవరణంలో సహచర న్యాయవాదులతో కలిసి జాతీయ జెండా ఎగురవేసి, గౌరవ వందనం చేశారు. చిత్తూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయుడు, సెక్రటరీ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ శకటంలో ఆకట్టుకున్న రైతు కుటుంబం - విద్యాశాఖ శకటం - విద్యుత్ శాఖ శకటం

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరులో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఏడు ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. శాంతిభద్రతల సంరక్షణలో పోలీసుల పనితీరు తెలియజేసేలా పోలీసు శాఖ శకటాన్ని ప్రదర్శించారు. విపత్తులు సంభవించిన సమయంలో ఆత్మరక్షణ విధానాలను తెలుపుతూ ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖకు చెందిన మిస్ట్ బుల్లెట్, మిస్ట్ జీపు, రెస్క్యూ టెండర్ శకటాలు ప్రదర్శించారు. కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నమూనా శకటం, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు, చంద్రన్న సంచార ఆరోగ్యపథకం, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108,104 సేవలను తెలియజేస్తూ వైద్యశాఖ శకటాలను ప్రదర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్స్, మనబడి-మన భవిష్యత్తువంటి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ విద్యాశాఖ, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తూ వ్యవసాయశాఖ,ప్రధానమంత్రి సూర్యఘర్ (సోలరైజేషన్) ప్రయోజనాలు వివరిస్తూ విద్యుత్ శాఖలు శకటాలను ప్రదర్శించాయి.వ్యవసాయ, విద్య, విద్యుత్ శాఖల శకటాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నాయి. ఆయా శాఖల అధికారులకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రదానం చేశారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య



శ్వేతప్రియ మృతదేహం

పెనుమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని ఓ నర్సింగ్ కాలేజ్‌లో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుమూరు క్రాస్‌రోడ్డుకు సమీపంలో ఉన్న నర్సింగ్ కాలేజ్‌లో బిహార్‌కు చెందిన హరిరాంలాల్ కుమార్తె శ్వేతప్రియ (20) చదుకుంటోంది. కాలేజ్ హాస్టల్ రూమ్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటైనా భోజనానికి రాకపోయేసరికి సహవిద్యార్థులు వెళ్లిచూడగా డోర్ లోపల లాక్‌చేసి ఉంది. ఎంతసేపు పిలిచినా పలకక పోవడంతో కాలేజీ నిర్వాహకులకు తెలియజేశారు. వారొచ్చి తలుపులు పగలగొట్టి చూడగా.. విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. దీనిపై పెనుమూరు పోలీసులకు కాలేజీ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ మధు తెలిపారు.

లారీ బోల్తా : క్లీనర్ మృతి





మృతిచెందిన క్లీనర్ సోనూ

బంగారుపాళ్యం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తాపడిన ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా.. డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ మల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి చెన్నైకి సిలికా ఇసుక తరలిస్తున్న లారీ ఆదివారం మొగిలి ఘాట్‌లోకి రాగానే అదుపు తప్పి రహదారి పక్కనున్న గోతిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన లారీ క్లీనర్ సోనూ(35), డ్రైవర్ అనిల్ మీనా (37) తీవ్రంగా గాయపడ్డారు. క్లీనర్ ఇసుకలో కూరుకుపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు బాధితులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్లీనర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మరి.. ఫిర్యాదు చేసిందెవరు?

- పుత్తూరు పోలీసులపై టీడీపీ నేతల పేరిట లేఖ
- విచారణకు ఆదేశించిన ఎస్పీ
- తాము ఫిర్యాదు చేయలేదంటున్న నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పోలీసులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ టీడీపీ నేతల పేరిట ఎస్పీకి ఫిర్యాదు అందింది. విచారణకు వెళ్లిన ఎస్బీ సిబ్బంది సదరు నేతలు తాము ఫిర్యాదు చేయలేదని చెబుతున్నారు. మరి ఫిర్యాదు చేసిందెవరనే కోణంలో ఆరా తీస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. పుత్తూరు పోలీసులపై టీడీపీకి చెందిన కొందరు నేతలు, మున్సిపల్ ప్రజాప్రతినిధి ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మద్యం షాపు నుంచి నెలకు రూ.25 వేలు డిమాండ్ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులు కొనసాగుతున్నాయని తెలిపారు. బియ్యం అక్రమ రవాణాలో చేతివాటం చూపారని ఆరోపించారు. గతేడాది నవంబరులో నగరికి చెందిన బియ్యం స్మగ్లర్‌పై పెట్టిన కేసులో పురోగతి లేకపోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులో పేర్లున్న నాయకులను విచారించి వాస్తవాలను తెలియజేయాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు ఎస్పీ ఆదేశించినట్లు తెలిసింది. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సదరు నేతల వద్దకు వెళ్లి విచారించగా, తాము ఫిర్యాదు చేయలేదని, తమ పేరిట ఎవరైనా చేసుండొచ్చని చెప్పారట. మద్యం లైసెన్సుదారులను విచారించినా సమాధానం రాలేదు. మరి.. ఎస్పీకి ఫిర్యాదు చేసిందెవరని ఆరా తీసే పనిలో పడ్డారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

విజయం, లిటిల్ ఫ్లవర్, న్యూయార్క్ పాఠశాలలకు బహుమతులు



వరదప్ప నాయుడు పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన - విజయం పాఠశాల విద్యార్థుల విన్యాసం



న్యూయార్క్ పాఠశాల విద్యార్థుల విన్యాసం

చిత్తూరు కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దిన వేడుకల్లో చిత్తూరు నగర పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వరదప్ప నాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పండగొచ్చె నమ్మా, బీవీరెడ్డి పాఠశాల విద్యార్థులు.. సునోగౌర్ సే దునియా వాలో, విజయం పాఠశాల విద్యార్థులు.. ఈ జెండా పసిబోసి చిరునవ్వురా, న్యూయార్క్ విద్యార్థులు.. సందేసే ఆతే హై, లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు.. ఇది మన భారతం, క్యాంఫర్డ్ విద్యార్థులు.. ఏ దునియా, శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు.. దేశం మనదే, సంకల్ప యోగా ట్రస్ట్ నిర్వాహకుల యోగాసనాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. విజయం, లిటిల్ ఫ్లవర్, న్యూయార్క్ పాఠశాలల విద్యార్థులకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కాయి.



లిటిల్ ఫ్లవర్ పాఠశాల నృత్య ప్రదర్శన

వైజ్ఞానిక ప్రదర్శనలో ఎల్లంకివారిపల్లి విద్యార్థి ప్రతిభ



కల్లూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో నిర్వహించిన దక్షిణభారత విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.ఆకాష్ ప్రతిభ కనబరిచినట్లు ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, ప్రధానోపాధ్యాయులు హరిశంకర్ తెలిపారు.తొమ్మిదో తరగతి చదువుతున్న ఆకాష్ స్మార్ట్ హౌస్ అనే ప్రయోగాన్ని ప్రదర్శించడంతో ఆకాష్‌కు బహుమతులు అందజేశారన్నారు.

టీడీపీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు



చిత్తూరు సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా టీడీపీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు త్రివర్ణపతాకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగధనులు ప్రాణాలర్పించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న గోవుల లారీ అడ్డగింత



గోవులను తరలిస్తున్న లారీని అడ్డుకున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి తమిళనాడులోని కబేళాలకు గోవులను తరలిస్తున్న గూడ్స్ లారీని పుంగనూరు వద్దనున్న టోల్‌గేట్ సమీపంలో అఖిల భారత గోసంరక్ష సంఘ్ ప్రధాన కార్యదర్శి పి.అయూబ్‌ఖాన్ అడ్డుకున్నారు. ఆదివారం 49 పశువులను తరలిస్తున్న లారీని ఆపి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై పలమనేరు డీఎస్పీ, పెద్దపంజాణి ఎస్ఐలకు ఫోన్‌లో సమాచారం అందించినా స్పందించలేదన్నారు. 2 గంటలపాటు లారీని ఆపి ఉంచినా పోలీసులు రాకపోవడంతో డ్రైవర్ లారీతో వెళ్లిపోయాడని చెప్పారు. ఆ తర్వాత ఓ కానిస్టేబుల్ వచ్చారని.. ఇప్పుడే లారీ వెళుతోందని తెలిపినా కనీస చర్యలు లేవని వాపోయారు.

హౌసింగ్ కాలనీకి వీర జవాన్ కార్తీక్ పేరు

బంగారుపాళ్యం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన కార్తీక్ జ్ఞాపకార్థం బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట పంచాయతీలోని హౌసింగ్ కాలనీకి ఆయన పేరును పెట్టినట్లు సర్పంచ్ తోటా శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి మణి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కార్తీక్ పేరును తాను నివాసం ఉండిన హౌసింగ్ కాలనీకి పెట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ ప్రతిపాదించారు. దీంతో రిపబ్లిక్ డే సందర్భంగా పంచాయతీలో తీర్మానం చేసి.. వార్డు సభ్యుల ఆమోదంతో హౌసింగ్ కాలనీకి పేరు మార్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

చితూరు అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కూడా పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి



ర్యాలీలో రైతు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య తదితరులు

పలమనేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా కనీస మద్దతు చెల్లించాలని, రైతు కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలన్న పలు డిమాండ్ల సాధనకై పలమనేరులో ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్రం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తిరిగి దొడ్డిదారిన ప్రవేశపెట్టేందుకే నూతన మార్కెటింగ్ డిజిటల్ సహకార చట్టాల ముసాయిదా పేరున కేంద్రం తీసుకొస్తోందని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ నాయకులు ఓబుల్‌రాజు, మునిరత్నంనాయుడు, విజయగౌరి, కార్మిక నాయకులు చెన్నకేశవులు, మంజునాథ్, సదాశివయ్య, శంకరప్ప, రవి, రఘు, రామ్మూర్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా వైద్యసేవలు



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

పలమనేరు, జనవరి 26: పలమనేరులోని ఈద్గా ఆవరణలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక సాయిరాం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిరాం ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ యుగంధర్, తరంగిణి దంపతులు, డాక్టర్లు శారద, మల్లికార్జునరెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

చౌడేపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లెలోని ఉన్నత పాఠశాలలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు జయమోహన్, చంద్రశేఖర్ నగదు బహుమతి అందించారు. అలాగే పేద విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి రూ.2 వేలు చొప్పున సాయం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి, స్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సుధాకర్, ఉపాధ్యాయులు మురళీ, ఈశ్వర్, శ్రీనివాసులు, అరుణ, పూర్ణిమ, సుమిత్ర, ఆనంద్ పాల్గొన్నారు.

వడ్డెర నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన వడ్డెర సంఘ కమిటీ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, చౌడేపల్లె మండలాల వడ్డెర సంఘాలకు ఆదివారం నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ వడ్డెర సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో జరిగిన వడ్డెర సంఘ సభ్యుల సమావేశంలో పుంగనూరు, చౌడేపల్లె కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. పుంగనూరు మండల వడ్డెర సంఘ అధ్యక్షుడుగా వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సందీప్‌కుమార్, కార్యదర్శిగా బి. వెంకటరమణ, కోశాధికారిగా వి. వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే చౌడేపల్లె మండల వడ్డెరసంఘ అధ్యక్షుడుగా జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా డి.జయకుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.రెడ్డెప్ప, కార్యదర్శిగా దాము, కోశాధికారిగా కాటమన్నలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

4న రథ సప్తమి వేడుకలు

కుప్పం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం లక్ష్మీపురంలో వెలసిన ప్రసన్న వరదరాజస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 4వ తేదీన రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. రథ సప్తమిని పురస్కరించుకొని స్వామివారికి ఉదయం, సాయంత్ర వేళల్లో సప్తవాహన సేవలు నిర్వహిస్తామన్నారు. ఉదయం వరుసగా సూర్యప్రభ, శేష, వెండి గరుడ, హనుమంత వాహనాలు, సాయంత్రం అశ్వ, సింహ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారిని నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తామని చెప్పారు. భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

2న సోమలలో నాగబాబు పర్యటన

సోమల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 2న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు జనసేన నాయకుడు నాగబాబు సోమల మండలంలో పర్యటించ నున్నారు. సోమల-తిరుపతి రోడ్డులోని సూరయ్యగారిపల్లె బస్టాండ్‌లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణలో నాగబాబు, జిల్లా జనసేన నాయకులు పాల్గొననున్నారు. అలాగే సోమల హైస్కూల్ ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈక్రమంలోనే జనసేన నాయకులు ఆదివారం సభకు స్థల పరిశీలన ఏర్పాట్లు చేపట్టారు. జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పుంగనూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమహాల్‌లో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు లయన్స్‌క్లబ్, అంజుమాన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ శివ, త్రిమూర్తిరెడ్డి, అమరావతి సురేశ్, గోపాల్‌కృష్ణ, శ్రీరాములు, అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్‌సలీం, కార్యదర్శి ఇబ్రహీం పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పారిశ్రామిక వాడ సమస్యల పరిష్కారానికి చర్యలు

పలమనేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని పారిశ్రామిక వాడ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పారిశ్రామిక వాడ నూతన కార్యవర్గానికి హామీ ఇచ్చారు. ఆదివారం పారిశ్రామిక వాడ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పారిశ్రామిక వాడ నూతన కార్యవర్గం అధ్యక్షులు జగదీష్, గౌరవ అధ్యక్షులు అమరనాథరెడ్డి, ఉపాధ్యక్షులు మౌల, మహబూబ్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, జాయింట్ సెక్రటరీలు సుబ్రహ్మణ్యం, జావీద్, ఖాజా, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో యథేచ్ఛగా మాంసం విక్రయాలు

పుంగనూరు రూరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో గణతంత్ర దినోత్సవం రోజున ఆదివారం మాంసం దుకాణదారులు విచ్చలవిడిగా విక్రయాలు చేశారు. దుకాణ యజమానులు ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ చేసి అధిక ధరలకు విక్రయించారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారంపై హర్షం

రామకుప్పం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): శాసన సభ్యుడు, సినీ హీరో బాలకృష్ణకు కేంద్రం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడంపై రామకుప్పం మండలంలోని నందమూరి అభిమాన సంఘం నేతలు నందారెడ్డి, వెంకట రమణ, సుబ్రీ, అవినాశ్‌రెడ్డి, విశ్వనాథ్, బీడా వెంకటేశ్, సురేష్, ఆటో రమేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బాలకృష్ణ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఢిల్లీలో తలుపులనేనివారిపల్లె సర్పంచ్



జల్ జీవన్ మిషన్ డైరెక్టర్‌తో రాధాకృష్ణ

పూతలపట్టు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో తలుపులనేనివారిపల్లె సర్పంచ్ గల్లా రాధాకృష్ణన్ నాయుడు పాల్గొన్నారు. సర్పంచ్‌గా గ్రామస్థుల జీవన ప్రమాణాలు పెంపొందించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాడు. అలాగే జలజీవన్ మిషన్ కింద నుంచి ప్రోత్సాహకాలను అమలు చేయడంలో కృషి చేయడంతో ఢిల్లీకి ఆహ్వానం అందింది.

వరసిద్ధుడి సేవలో విద్యాశాఖ డైరెక్టర్

ఐరాల(కాణిపాకం), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

భారతమాతకు జేజేలు..!

● ఘనంగా గణతంత్ర దిన వేడుకలు



కుప్పం మున్సిపల్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు



పుంగనూరులో జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి



పలమనేరులో జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ కమిషనర్



ద్రావిడ వర్సిటీలో జెండా వందనం చేస్తున్న ఉపకులపతి ఆచార్య దొరస్వామి



కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో..



పలమనేరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి



కుప్పంలోని కళాశాలలో....



కల్లూరు ఉన్నత పాఠశాలలో..



పుంగనూరులో గాంధీజీకి నివాళులర్పిస్తున్న అధికారులు, కౌన్సిలర్లు



వి.కోట ఎంపీడీవో కార్యాలయంలో..



పెద్దపంజాణి ఎంపీడీవో కార్యాలయంలో...



సదుంలో 3336 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ

కుప్పం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి భారతమాతకు జేజేలు పలికారు. కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కుప్పం మండల సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు జెండా ఆవిష్కరణ చేశారు. ఇక్కడ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కడా కార్యాలయంతోపాటు పలు డివిజనల్ ప్రభుత్వ కార్యాలయాలు, రెస్కో కార్యాలయాలలో రిపబ్లిక్ వేడుకలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్య, కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమాల్లో కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్, మండల పరిషత్తు, డివిజనల్ స్థాయి అధికారులు, ఉద్యోగులు, ఎంఈవో మహబూబ్‌బాషా, విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ద్రావిడ వర్సిటీలో ఉపకులపతి ఆచార్య దొరస్వామి జెండా ఆవిష్కరించారు.

● పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలమనేరు టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి జెండా వందనం చేశారు. అలాగే బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, చౌడేపల్లె, వి.కోట, గంగవరం మండలాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

● పుంగనూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం పుంగనూరులో వాడవాడల ఘనంగా నిర్వహించారు. స్థానిక రాంపల్లెలోని మాజీ సైనికుల సంక్షేమ భవన్ వద్ద పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కృష్ణవంశీ, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, పోలీసుస్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే అన్ని కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అలాగే సదుం, రొంపిచెర్ల, చౌడేపల్లె, సోమల మండలాల్లోని కార్యాలయాలు, పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



చౌడేపల్లె: కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపీడీవో లీలామాధవి



చౌడేపల్లె: అవార్డు అందుకుంటున్న పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్



సోమల: ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సీహెచ్‌వో అమరనాథ్



పలమనేరు: కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సంజీవకుమార్



ప్రశంసాపత్రం అందుకుంటున్న పలమనేరు మెప్మా సీఎంఎం బాబా



రామకుప్పం: ప్రశంసాపత్రం అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

చౌడేపల్లె, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సీఐగా పుంగనూర్ రూరల్ సీఐ రాంభూపాల్, ఉత్తమ ఎంపీడీవోగా లీలామాధవి ఆదివారం చిత్తూరులో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోల్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వారిని అభినందించారు.

●కుప్పం: కుప్పం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుకు గణతంత్ర దినోత్సవ వేళ పురస్కారం లభించింది. పురపాలక సంఘంలో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో విశేష కృషి చేసినందుకు ఆదివారం చిత్తూరులో జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ ప్రశంసాపత్రం అందుకున్నారు. కుప్పం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎ.నాగరాజుకు అబ్కారీ శాఖలో నేర నియంత్రణ, ప్రభుత్వ ఆదాయం పెంపు విషయాలలో విశేషమైన కృషి చేసినందుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్, డైరెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు.

●రామకుప్పం: రామకుప్పం మండలం పంద్యాలమడుగు బీట్ ఎఫ్‌బీవో సుబ్రహ్మణ్య ఆదివారం చిత్తూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టరు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే బల్ల ఎఫ్‌బీవో హరిబాబు డీఎఫ్‌వో భరణి చేతుల మీదుగా, బైపరెడ్డపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్ చక్రధర్ జిల్లా సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

●పలమనేరు: పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్, పలమనేరు మెప్మా అధికారి బాబా, మున్సిపల్ కార్యాలయంలో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జీవా, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఇందిర జిల్లా కలెక్టర్ నుంచి ఆదివారం ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

● సోమల: సోమల పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న అమరనాథ్ రిపబ్లిక్ డే సందర్భంగా చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

●పుంగనూరు: తిరుపతి ఎస్పీడీసీఎల్ సర్కిల్‌లోని 9 జిల్లాల్లో ఉత్తమ సబ్‌డివిజన్‌గా పుంగనూరును ఎంపిక చేసి ఏడీఈ పి.శ్రీనివాసులుకు సీఎండీ సంతోషరావు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆదివారం తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో శ్రీనివాసులు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పుంగనూరు, చౌడేపల్లె, పెద్దపంజాణి మండలాల్లోని ఏఈలు, సిబ్బంది పనితీరుతో ఉత్తమ సబ్ డివిజన్‌గా గుర్తింపు రావడం జరిగిందన్నారు. అలాగే ఉత్తమ ఏడీఈగా సదుం ఏడీఈ నరేంద్రకు సీఎండీ ప్రశంసాపత్రం అందజేశారు.

●పుంగనూరు రూరల్: పుంగనూరు మండల సర్వేయర్ శ్రీనివాసులు నాయక్‌కు ఉత్తమ అధికారిగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ●పెద్దపంజాణి: పెద్దపంజాణి ఉపాధి ఏపీవో మురుగేష్ ఆదివారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

●శాంతిపురం: శాంతిపురం ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదివారం చిత్తూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. పలువురు అభినందించారు.



రామకుప్పం: ప్రశంసాపత్రం అందుకుంటున్న హరిబాబు



ప్రశంసాపత్రం అందుకుంటున్న శాంతిపురం ఎంపీడీవో కుమార్




రామకుప్పం: పురస్కారం అందుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ చక్రధర్



కుప్పం: పురస్కారం అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ నాగరాజు



ప్రశంసాపత్రం అందుకుంటున్న పుంగనూరు ఏడీఈ శ్రీనివాసులు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



మున్సిపల్ డేటాఎంట్రీ ఆపరేటర్ జీవా, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పి. ఇందిర



కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకుంటున్న సర్వేయర్ శ్రీనివాసులు



సమస్యలు పరిష్కరించి పుణ్యం కట్టుకోండి

20 ఏళ్లుగా నివాసం ఉంటున్నాను. వర్షం వచ్చినప్పుడల్లా కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలాసార్లు నా సొంత డబ్బులతో వీధికి మట్టి పోయించాను. మురగంతా ఒకేచోట చేరిపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో నేనే స్వయంగా శుభ్రం చేయించాను. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాను. అక్కడక్కడా పనులు చేస్తున్నారు తప్ప అవసరమైన చోట్ల చేయడం లేదు. ఇకనైనా మా సమస్యలు పరిష్కరించి పుణ్యం కట్టుకోండి.

- ముత్యాలశెట్టి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు





దోమల బెడదతో నిద్ర ఉండటం లేదు



ఐదేళ్ల క్రితం ఇక్కడున్న అపార్టుమెంటులో ఫ్లాట్ కొనుక్కున్నాం. కాలనీలో సరైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. పనులు ముగించుకుని రాత్రి వేళల్లో ఇళ్లకు వస్తాం. విద్యుద్దీపాలు కూడా లేకపోవడంతో రావడానికి కష్టంగా ఉంది. కాలువ లేకపోవడంతో మురుగంతా ఒకేచోట నిల్వ చేరింది. దీనివల్ల దోమలు పెరిగిపోయి నిద్ర ఉండటం లేదు. పట్టించుకునేవారు లేరు.

- డొక్కాహరిత, దంత వైద్యురాలు



20 ఏళ్ల క్రితం వేసిన రోడ్లే..



20 ఏళ్ల క్రితం ఈ వీధిలో సిమెంటు రోడ్డు వేశారు. ఆ తర్వాత వీధి విస్తరించి మరో అరకిలో మీటరు వరకు ఇళ్లు వచ్చాయి. కొత్తగా ఏర్పడిన ఇళ్లకు వెళ్లడానికి మట్టి రోడ్డే గతి. ఇక ఎప్పుడో వేసిన సిమెంటు రోడ్డు ప్రస్తుతం కంకరతేలింది. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందిచలేదు.

- విజయసింహారెడ్డి, వ్యాపారి

చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయం

మట్టి రోడ్లు ఎక్కువగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే బురదమంగా మారుతున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వెళ్లలేని పరిస్థితి ఉంటుందని కాలనీవాసులు తెలిపారు.

నాల్గవ వీధిలో సిమెంటు రోడ్డు లేదు



నాల్గవ వీధిలో సిమెంటు రోడ్డు లేదు. దాంతో మట్టిరోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నాం. వీధిని ఆనుకుని పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాత్రి వేళల్లో పాములు, ఇతర విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది.

- ఈశ్వరి, గృహిణి



అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

ఆంధ్రజ్యోతి

మురికి మడుగు విజయలక్ష్మి కాలనీ

35 ఏళ్లుగా మౌలిక వసతుల కరువు

మురుగు స్తంభించడంతో దోమల స్వైర విహారం

చినుకుపడితే రోడ్లన్నీ చిత్తడే - అడుగుపెట్టలేమంటున్న స్థానికులు

మట్టి రోడ్లు.. ఇళ్ల మధ్య నిలిచిన మురుగు.. పిచ్చి మొక్కలు.. ఇవన్నీ చూస్తుంటే ఇదేదో పల్లెటూరు అనుకునేరు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 46వ డివిజన్‌లో ఉన్న విజయలక్ష్మి కాలనీ దుస్థితి ఇది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

విజయలక్ష్మి కాలనీ 1990లో ఏర్పడింది. 35 ఏళ్ల అవుతున్నా ఇక్కడ ఎక్కువగా మట్టిరోడ్లే కనిపిస్తాయి. గతంలో ఎప్పుడో కొన్నిచోట్ల వేసిన సిమెంటు రోడ్లు కంకరతేలి ఉన్నాయి. దీనివల్ల రాత్రివేళ పనులు ముగించుకుని ఇళ్లకు చేరే క్రమంలో స్థానికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ సుమారు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరిలో టీచర్లు అధికంగా ఉన్నారు. అపార్టుమెంటు, విల్లాలు, పెద్ద పెద్ద భవంతులు కూడా ఇప్పుడిప్పుడే వెలుస్తున్నాయి. ఇళ్లమధ్య, ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మురుగంతా ఇళ్లమధ్యనే..

ఐదో వీధిలో మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్లు, అపార్టుమెంట్ల నుంచి వ్యర్థపు నీరంతా ఎటూ వెళ్లడం లేదు. ఇళ్లమధ్యనే నిల్వ చేరడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగును ఆనుకుని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. విషపురుగులు, పందులకు ఆవాసంగా మారాయి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రయితే బయటకు రావాలంటే స్థానికులు భయపడుతున్నారు. అలాగే మూడో వీధిల్లో 20 ఏళ్ల క్రితం ఇండ్లు ఉన్నంత వరకు సిమెంటు రోడ్డు వేశారు. ఆ తర్వాత వీధి విస్తరించినప్పటికీ సిమెంటు రోడ్డును వేయలేదు. ఎప్పుడో వేసిన సిమెంటు రోడ్డు కూడా కంకరతేలి పోయింది.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఎక్కడెక్కడ ఏమేమి అవసరమో గుర్తించాం. సిమెంటు రోడ్లు, వీధి దీపాలు, మురుగుకాల్వలు, కల్వర్టుల నిర్మాణానికి నివేదికలు తయారు చేసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహ ప్రసాద్‌ల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

- సురేష్, 46వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి



కలెక్టరేట్‌లో సిబ్బందితో కలిసి జాతీయ జెండాకు వందనం చేస్తున్న జేసీ విద్యాధరి



గంగాధరనెల్లూరు హైస్కూల్లో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు హారతి ఇస్తున్న ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్



పి.కొత్తకోట గురుకుల పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వాడవాడలా గణతంత్ర దినోత్సవం

చిత్తూరు సెంట్రల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణ తంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బంగ్లాలో ఆదివారం కలెక్టర్ సుమిత్ కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ విద్యాధరి జాతీయ జెండాను ఎగురవేశారు. స్పందన హాలులో అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు జేసీతో పాటు డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పుష్పాంజలి సమర్పించారు. కలెక్టరేట్ ఏవో కులశేఖర్, జిల్లా అధికారులు, పలు విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యాశాఖలో డీఈవో వరలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు. నగరంలోని విజయం, బృందావన్ పాఠశాలల్లోనూ గణ తంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

చిత్తూరు అర్బన్: ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఎంటీవో భాస్కర్, క్యాంప్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. ● జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన వేడుకల్లో కార్య నిర్వహణాధికారి మనోహర్ గౌడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటాచలపతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. ● నగరపాలక కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కమిషనర్ నరసింహ ప్రసాద్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, సహాయ కమిషనర్ ప్రసాద్, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు కల్చరల్: చర్చివీధిలోని దేవదాయశాఖ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: పి.కొత్తకోట సమీపాన ఉన్న బాలయోగి గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. టీడీపీ నేతలు దొరబాబు చౌదరి, బాబు రావు, జయప్రకాష్ మునిరాజులు, తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కేశవులు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. విద్యార్థులతో కలిసి పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్‌పర్సన్ సంధ్యారాణి.. ఉగ్ర కాళీమాతగా చేసిన ప్రదర్శన స్థానికులను అలరించింది.

నగరి: జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో సూపరింటెండెంట్ ప్రభావతి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో భవానీశంకరి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణారెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేశారు.

గంగాధరనెల్లూరు: హైస్కూల్లో జాతీయ జెండాను ప్రభుత్వ విప్ థామస్ ఎగురవేశారు. టీడీపీ నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, స్వామిదాస్, దేవసుందరం తదితరులు పాల్గొన్నారు. ● వీరకనెల్లూరులోని స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణస్వామి రెడ్డి కుమారుడు రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ విశ్వనాథ రెడ్డిని స్వగృహంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి సన్మానించారు. పంచాయతీ కార్యదరులు తదితరులు పాల్గొన్నారు.



వీరక నెల్లూరులో స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణస్వామిరెడ్డి కుమారుడు విశ్వనాథ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

సంక్షిప్తంగా..

శ్మశాన దారికి మోక్షం

విజయపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పాతార్కాడులో శ్మశాన దారికి మోక్షం లభించింది. దారి చుట్టూ పిచ్చిమొక్కలు, కంపలు అల్లుకోవడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. జడ్పీ నిధుల నుంచి రూ.లక్ష మంజూరవడంతో సర్పంచ్ బొబ్బిలి ఆదివారం ఆ దారిని శుభ్రం చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

టీడీపీ నేతకు నివాళి

గంగాధరనెల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ ఈనెల 14వతేదిన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం జరిగిన సంస్మరణ సభలో టీడీపీ నాయకులతో కలిసి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ థామస్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాముల గుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. 114 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయగా, 41 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ తెలిపారు.

ఏఈలుగా పదోన్నతి

చిత్తూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పలువురు సబ్ ఇంజనీర్లకు ఏఈలుగా పదోన్నతి కల్పిస్తూ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. పాలసముద్రం సబ్ ఇంజనీర్ లోకేష్ రెడ్డి, మిట్టూరు సెక్షన్ నుంచి శివకుమార్‌కు, బంగారుపాళ్యం సెక్షన్ నుంచి ప్రసన్న, పుంగనూరు డివిజన్ నుంచి ప్రసాద్, ఉమామహేశ్వర్లకు పదోన్నతి లభించింది.

చిత్తూరు అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కళావతికి ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో ఆమె బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గుడిపాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులిచ్చారు.

విద్యుత్ శాఖలో పలువురికి అవార్డులు



సీఎండీ సంతోషరావు నుంచి అవార్డు అందుకుంటున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలో ఏడాది కాలంగా ఒక్క ప్రమాదం కూడా జరగకుండా ఈఈ మునిచంద్ర ఆధ్వర్యంలో విధులు నిర్వహించారు. దీనికిగాను విద్యుత్ ప్రమాదరహిత డివిజన్‌గా అవార్డు లభించింది. ఈ అవార్డును సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు చేతులమీదుగా మునిచంద్ర అందుకున్నారు. అలాగే వర్క్ ఆర్డర్లను సకాలంలో పూర్తి చేసినందుకు మిట్టూరు ఏఈ రాజేంద్రబాబు.. ఉత్తమ ఏఈగా అవార్డు అందుకున్నారు. వందశాతం బిల్లులు వసూలు చేసినందుకు పుంగనూరు డీఈ శ్రీనివాసులుకు, పైపల్లె ఏఏవో నాగేంద్రలకు సీఎండీ అవార్డులు అందజేశారు.

వీఆర్‌ఏ దాడిలో కారు అద్దాలు ధ్వంసం

కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసంమైన కారు అద్దం

గుడిపాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో ఓ వీఆర్‌ఏ వీరంగం చేశాడు. కారు అద్దాలను ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన డేవిడ్, నిత్య దంపతులు, వీఆర్‌ఏ బాలాజి మధ్య ఆర్థిక లావాదేవీల కారణంగా మాటామాటా పెరిగింది. ఈనేపథ్యంలో నిత్యపై వీఆర్‌ఏ దాడిచేసి, ఆమెకు చెందిన కారు అద్దాలను ధ్వంసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఢిల్లీలో తలుపులనేనివారిపల్లె సర్పంచ్



జల్ జీవన్ మిషన్ డైరెక్టర్‌తో రాధాకృష్ణ

పూతలపట్టు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో తలుపులనేనివారిపల్లె సర్పంచ్ గల్లా రాధాకృష్ణన్ నాయుడు పాల్గొన్నారు. సర్పంచ్‌గా గ్రామస్తుల జీవన ప్రమాణాలు పెంపొందించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాడు. అలాగే జలజీవన్ మిషన్ కింద నుంచి ప్రోత్సాహకాలను అమలు చేయడంలో కృషి చేయడంతో ఢిల్లీకి ఆహ్వానం అందింది.

రక్తదాన శిబిరం

నగరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నగరి ఏరియా వైద్యశాలలో ఆల్ ఇండియా తౌహిత్ మహా రక్తదానం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన శిబిరంలో 33 యూనిట్ల రక్తం దానం చేశారు. సూపరింటెండెంట్ జరీనా, ఆర్‌ఎంవో మంజుల, స్పందన, బిందు, జీవన్‌లు, రహ్మతుల్లా, మహమ్మద్ అర్షత్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని మైదా ఫ్యాక్టరీ సమీపంలో స్మైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. సభ్యులు మనోజ్, సోము, సాయి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర సహాయ కోశాధికారిగా ఖయ్యూం



ఐరాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఐరాలకు చెందిన షేక్ ఖయ్యూం ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర సహాయ కోశాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని సింగ్‌నగర్ షాదీమహల్‌లో ఆయన ప్రమాణం స్వీకారం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన అధ్యక్షుడు సయ్యద్ సలాఉద్దీన్‌కి, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో విద్యాశాఖ డైరెక్టర్



విజయరామరాజుకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల (కాణిపాకం), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బంగారుపాళ్యం,జనవరి26(ఆంధ్రజ్యోతి):బంగారుపాళ్యం బాయ్స్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ నిర్వహిస్తున్న యువకులు లీలాప్రసాద్, అభిషేక్, సుజిత్,హేమంత్, కిరణ్ ఆధ్వర్యంలో దళితవాడలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకటకృష్ణ రోగులను పరీక్షించగా, 108మందికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

భక్తులకు అన్నప్రసాదం వితరణ

వెదురుకుప్పం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుపతికి చెందిన గోపాలం హిమభరత్ కుటుంబీకుల వితరణతో ఆదివారం భక్తులకు అన్నప్రసాదాన్ని ఆలయ అధికారి సురేష్‌కుమార్ పంపిణీ చేశారు.